విక్టరీ

# శ్రీ బ్రహ్మాండ మహాపురాణం

శ్రీ వేదవ్యాస మహర్షి కృతము



# శ్రీ బ్రహ్మాండ మహాపురాణం

శ్రీ వేదవ్యాస మహర్షి కృతము

**ఆవంచ సత్యనారాయణ**

# శ్రీ బ్రహ్మాండ మహాపురాణ విశేషాలు

## బ్రహ్మాండపురాణం

పురాణ గణనంలో అనేకమంది ఒప్పుకొన్న గణన ప్రకారం బ్రహ్మాండపురాణం పద్దెనిమిదవ పురాణం. సమస్త బ్రహ్మాండాన్ని గుఱించిన వివరణగల పురాణం అయినందువలన ఇది బ్రహ్మాండ పురాణం అయింది. ఈ సమస్త భువనము యొక్కలేక సకల చరాచర బ్రహ్మాండ వర్ణన అన్ని పురా ణములలోను లభ్యం అవుతూ ఉన్నా, ఇందులో పూర్తి బ్రహ్మాండం యొక్క సాంగోపాంగ వివరణ ఉన్నందువలన ఇది బ్రహ్మాండ పురాణం అని పిలువబడుతున్నది.

సమస్త బ్రహ్మాండాన్ని ఆధారంగా తీసుకొని బ్రహ్మచేత భవిష్యకల్పవృత్తాంతంగా చెప్పబడిన పురాణం కాబట్టి దీనిపేరు బ్రహ్మాండపురాణం అయింది.

**బ్రహ్మ బ్రహ్మాండ మాహాత్మ్యమ్ అధికృత్య బ్రవీత్ పునః**
**తచ్చ ద్వాదశ సాహస్రమ్ బ్రహ్మాండమ్ ద్విశతాధికమ్**
**భవిష్యానామ్ చ కల్పానామ్ శ్రూయతే యత్ర విస్తరాః**
**తద్ బ్రహ్మాండపురాణమ్ చ బ్రహ్మణాసముదాహృతం** (మత్స్యపురాణం - 53, 54, 55)

శివపురాణం ఈ పురాణమునందు బ్రహ్మాండమునందలి భూగోళమును వివరించున్నందు వలన దీనిని బ్రహ్మాండమని పేరు వచ్చినదని చెప్పుచున్నది. (బ్రహ్మాండచరితో క్తత్వాద్ బ్రహ్మాండం పరికీర్తితమ్ ॥ బ్రహ్మాండంచాతిపుణ్యేయం పురాణానామనుక్రమః (శివ -ఉ.సం. 44-143).

అలాగే నారద పురాణంలో చెప్పబడిన దానిని బట్టి ఈ పురాణం వాయువు చేత వ్యాసునకు ఉపదేశింపబడింది. అందువలననే దీనికి వాయుప్రోక్త బ్రహ్మాండపురాణమని లేక వాయవీయ బ్రహ్మాండపురాణమని పేరు ఇవ్వబడింది. ఇది ఇంకా లోతుగా పరిశీలింపబడవలసిన విషయం. నారదపురాణాన్ని అనుసరించి వాయుదేవుడు వ్యాసునికి ఈ పురాణాన్ని బోధించాడని తెలుస్తున్నది. అందువలననే సరిగా ఇది వాయుప్రోక్త బ్రహ్మాండ పురాణమని చెప్పబడింది.

## బ్రహ్మాండపురాణంలో ఏం చెప్పబడింది ?

ఈ పురాణ ప్రథమ ఖండంలో విశ్వభూగోళ వర్ణన విస్తృతంగా చేయబడింది. ఈ భూగోళం యొక్క వర్ణన విస్తృతంగా ఉండటమే కాదు చక్కని కవితా శైలిలో ఉంటుంది. జంబూద్వీపము, అందులోని పర్వత, నదీనద వర్ణన 66 నుంచి 72 వరకు ఉన్న అధ్యాయాలలో చేయబడింది.

భద్రాశ్వ, కేతుమాల, చంద్రద్వీప, కింపురుషవర్ష, కైలాస, శాల్మలీ ద్వీప, కుశద్వీప, క్రౌంచద్వీప, శాకద్వీప, పుష్కరద్వీపమువంటి అనేక వర్షములు, దీపముల వర్ణన విభిన్న అధ్యాయాలలో, ఆకర్ష ణీయంగా సమగ్రంగా లభ్యం అవుతున్నది. ఈ పురాణపు తృతీయపాదంలో భారతదేశంలోని ప్రసిద్ధు లైన క్షత్రియవంశ వివరణ చారిత్రక దృష్టితో చాలా విలువగల భాగం.

ఇందలి 16 నుంచి 18 వరకుగల అధ్యాయములలో భవిష్యకల్ప వృత్తాంతము విస్తృతంగా వర్ణింపబడినది. ఈ విధమైన విస్తృత కల్పవిషయ వివరణ ఇతర పురాణములందు ఎచ్చటను లేదు. 33 నుంచి 38 అధ్యాయములలో చేయబడిన బ్రహ్మాండములోని విభిన్న స్థానములు, భౌగో ళిక వివరణము ఇతర పురాణములలో కన్పించదు. అందువలననే నేడు లభ్యమగుచున్న బ్రహ్మాండ పురాణము యొక్క అస్తిత్వము, ప్రాచీనత, మహాపురాణత్వము, మౌలికత్వములను గుఱించి ఎట్టి సంశయమును అక్కరలేదు. ఈ పురాణ శైలిహృద్యముగా ఉండును. స్కాందపురాణములో అనేక మహాత్మ్యములు వర్ణితములైనట్లుగా ఇందును అనేక మాహాత్మ్య కథలు, గాథలు చెప్పబడినవి.

ఈ పురాణాన్ని గురించిన ఇంకొక ప్రత్యేకత ఏమంటే క్రీ.శ. 5వ శతాబ్దంలో బ్రాహ్మణులు ఈ పురాణాన్ని జ్వాలా(బలి)ద్వీపానికి తీసుకొనిపోయారు. అక్కడ ఇది ప్రాచీన జావాభాష అయిన 'కవిభాష'లోకి అనువదించబడింది. ఆ అనువాదం ఈ రోజుకు ఉపలబ్ధం అవుతున్నది. అందువలన ఈ పురాణం చాలా ప్రాచీన కాలానికి చెందినదిగా భావించవచ్చును. జావాద్వీపపు కవి భాషలోని అనువాదాన్ని అనుసరించి ఈ పురాణ కాలాన్ని నిర్ణయం చేసే వీలుకలుగుతుంది. ప్రస్తుతము ప్రచారములో ఉన్న బ్రహ్మాండపురాణములో భవిష్యరాజవంశవర్ణన వృత్తాంతము తప్ప మిగిలిన భాగమంతా ప్రాచీన జావాభాషలో లభ్యమగుచున్న బ్రహ్మాండపురాణముతో సరిపోతున్నది. ఈ భాగములో పురాణ పంచలక్షణములన్నీ ఉండుటచే ఇది ప్రాచీన పురాణమని చెప్పవచ్చు.

బ్రహ్మాండపురాణంలోని నాలుగు భాగాలుగా చెప్పబడే ప్రక్రియ అనుషఙ్గ, ఉపోద్ఘాత, ఉపసంహా రాలనే విభాగాలే వాయుపురాణంలో కూడా ఉన్నాయి. ఇది కూడా కొందరు విద్వాంసులు వాయు పురాణమే బ్రహ్మాండపురాణమని పిలువబడిందని నిర్ణయించటానికి కారణం అయింది.

మత్స్యపురాణంలో పద్దెనిమిది పురాణాలుగా పేర్కొంటున్న శ్లోకాన్నిబట్టి, ఈ పద్దెనిమిది పురా ణాలను కలిపి బ్రహ్మాండపురాణం అని పిలిచేవారని ఊహించటానికి అవకాశం ఉన్నది. అప్పుడు మత్స్యపురాణానుసారం పద్దెనిమిదవ పురాణం బ్రహ్మాండపురాణంకాదు. ఇది ఇంకా చర్చించి నిర్ణయించవలసిన విషయం.

## బ్రహ్మాండపురాణం - విభాగాలు

**శృణువత్స ప్రవక్ష్యామి బ్రహ్మాండాఖ్యం పురాతనమ్**
**యచ్చద్వాదశ సాహస్రం భావికల్పక థాయుతమ్**
**ప్రక్రియాఖ్యో ౨ అనుషంగాఖ్య ఉపోద్ఘాతస్తృతీయకః**
**చతుర్థం ఉపసంహారః పాదాశ్చత్వార ఏవహి**

**పూర్వపాదద్వయం పూర్వోభాగో ఽత్ర సముదాహృతః**
**తృతీయోమధ్యయో భాగశ్చతుర్థస్తుత్తరోమతః**

అని చెప్పబడింది. నారదపురాణంలో చెప్పబడిన ఈ వర్ణన ప్రకారం బ్రహ్మాండపురాణంలో మొత్తం 161 అధ్యాయాలు ఉన్నాయి.

మత్స్యపురాణానుసారం ఇందు 12,200 శ్లోకములుగలవు. నారద పురాణానుసారము ఇందలి శ్లోక సంఖ్య 12,000. ఇందు పాదములనబడు నాలుగు భాగములు కలవు. 1. ప్రక్రియా పాదము 2. అనుషంగ పాదము 3. ఉపోద్ఘాత పాదము 4. ఉపసంహార పాదము. వీనిలో ప్రథమ ద్వితీయ పాదములను పూర్వభాగమనియు తృతీయ పాదమును మధ్యమ భాగమనియు చతుర్థ పాదములను ఉత్తర భాగమనియు పిలుతురు. ఈ పురాణమున మొత్తం 161 అధ్యాయములు కలవు. ఇందలి నాలుగు పాదములందును తృతీయ పాదము పెద్దది. ఈ తృతీయ పాద ప్రారంభమునందు 9 నుంచి 20 అధ్యాయములలో 879 శ్లోకములలో శ్రాద్ధ సంబంధమైన సర్వ విషయములు సాంగోపాంగముగావింపబినవి. అట్లే 21 నుంచి 47 వ అధ్యాయము వరకు 2550 శ్లోకములలో పరశురామావతార కథ అతి విస్తారముగా చెప్పబడినది. అటుతరువాత 48 నుంచి 54వ అధ్యాయము వరకు సగరుని వంశవృత్తాంతము, భగీరథునిచే గంగ భూమికి తీసుకొని రాబడి వృత్తాంతము, భగీరథునిచేత గంగభూమికి తీసుకొని రాబడిన వృత్తాంతము వర్ణింపబడినది. అటు పిమ్మట 196 అధ్యాయములలో సూర్యచంద్రవంశ రాజుల చరిత్రలు చెప్పబడినవి. ఈ పురాణములన్నింటిలో బ్రహ్మపురాణము మొదటిది. బ్రహ్మాండపురాణముచివరిదగు పద్దెనిమిదవది అగుచున్నది. మధ్యలో బ్రహ్మవైవర్త పురాణము కలదు. (ఆదావన్తేచ మధ్యేచ హరిః సర్వత్ర గీయతే) అనే సూక్తి ఈ విధంగా నిరూపించబడింది.

బ్రహ్మాండపురాణంలో ఈ విశ్వము యొక్క సాంగోపాంగ వివరణము ఉన్నది. ఈ పురాణ ప్రథమ ఖండంలోనే భూగోళము యొక్క చక్కని వర్ణన లభ్యం అవుతుంది. 66-72 అధ్యాయాలలో జంబూద్వీప వర్ణనలో పర్వత అరణ్య నదీనద వర్ణనం విస్తారంగా ఉన్నది. ఇక్కడే విభిన్న ద్వీపములు సంవత్సర కాలాల వర్ణనం ఉన్నది. నక్షత్ర మండలపు యుగములు కూడా దిగ్దర్శనంగా వివరింపబడ్డాయి. ఈ పురాణపు తృతీయ పాదములో చెప్పబడిన ప్రసిద్ధ రాజవంశముల వర్ణనము ఐతిహాసిక దృష్టిలో పరిశలించిన చాలా ప్రాముఖ్యత కలది. నారదీయ పురాణములో చెప్పబడిన ప్రకారము ఆధ్యాత్మ రామాయణము ఇందలి భాగము. కానీ ఇప్పుడు ఉపలబ్ధములగుచున్న బ్రహ్మాండపురాణమునందు ఆధ్యాత్మ రామాయణము లేదు. ఆధ్యాత్మ రామాయణమునందు శ్రీ రామచరిత్రము జ్ఞానాధారముగా వర్ణించబడినది. ఆధ్యాత్మ రామాయణమున చెప్పబడిన ప్రకారము శ్రీరాముడే పరబ్రహ్మము. సీత ఆ పరబ్రహ్మము యొక్క ప్రకృతి. రాముడు పరబ్రహ్మమే అయిన యెడల సీత తప్పక ఆ పరబ్రహ్మ యొక్క అనిర్వచనీయమైన మాయయే కావలెను కదా. ఆ పరబ్రహ్మ యొక్క లీలచేతనే ఈ సమస్త విశ్వమును ప్రవర్తించుచున్నది. భూమికి భారమైనప్పుడు భూదేవిచే ప్రార్థింపబడి ఆ బ్రహ్మయే తన మాయచే భూమికి దిగివచ్చి తన లీలలను ప్రదర్శించును.

**'ఆదావన్తేచ మధ్యేచ హరిః సర్వత్ర గీయతే'** అని మొదటిదైన బ్రహ్మపురాణము మధ్య యందుగల బ్రహ్మవైవర్త పురాణము చివరిదైన బ్రహ్మాండపురాణములలో హరి కల్పింపబడుచున్నాడని చెప్ప బడినది. కానీ స్కాందపురాణం శివుని గురించి కీర్తించుచున్న పది పురాణములలో బ్రహ్మాండము మొదటిది అని చెప్పుచున్నది.

ఈ పురాణమునందున్నట్లుగా కల్ప వివరణము మరి ఏ ఇతర పురాణములలోను లేదు. ఇట్లే ఇందులో ఈ బ్రహ్మాండంలోని విభిన్న స్థానముల భౌగోళిక నది వివరణ ఇతర పురాణాలలో ఎక్కడా లేదు. స్కాందపురాణంలో అనేక మహాత్మ్యాలు చెప్పినట్లే ఈ పురాణంలో కూడా స్థల తీర్థ మహాత్మ్యములు అనేకాలున్నాయి. ఇందులో రామాయణం విస్తృతంగా చెప్పబడింది. అదే ఆధ్యాత్మ రామాయణంగా ప్రసిద్ధి చెందింది. కానీ నారదపురాణ విషయసూచికలో రామాయణ విషయమే లేదు. ఈ బ్రహ్మాండపురాణంలో ఇంకొక విశేషం లలితోపాఖ్యానం వివరించడం. ఇది శాక్తేయులకు చాలా ముఖ్యమైన విషయం. కానీ శ్లోకసంఖ్యనుబట్టి చూస్తే ఆధ్యాత్మ రామాయణం, లలితో పాఖ్యానాలు బ్రహ్మాండపరాణాంతార్గతాలు అయ్యే అవకాశం లేదు. అయినా ఇందులో గణేశ కవచం, తులసీ కవచం, సిద్ధలక్ష్మీస్తోత్రం, సీతాస్తోత్రం, లలితాసహస్రనామము, సరస్వతీ స్తోత్రం మొదలైన అనేక సోత్రాలు కవచాలు ఉన్నట్లు తెలుస్తున్నది. ఇవి భక్తులకు చాలా ముఖ్యమైనవి. దీని శ్రవణఫలం నారదపురాణంలో చెప్పబడింది. 'య ఇదం కీర్తయేద్వత్స. శృణోతి చ సమాహితః స విధూయేహ పాపానియాతి లోకమనామయమ్ లిఖిత్వైతత్ పురాణస్తు స్వర్ణ సింహాసన స్థితమ్ పాత్రేణాచ్ఛాదితం యస్తు బ్రాహ్మణాయి ప్రయచ్ఛత్తి సయాతి బ్రహ్మణో లోకం నాత్ర కార్యా విచారణా' అని నారదపురాణం కీర్తిస్తున్నది.

ఇందులో ప్రారంభంలో సృష్టి వివరణ వర్ణింపబడింది. తరువాత యోగము, సృష్టి లక్షణములు, బ్రహ్మోత్పత్తి, కుమారోత్పత్తి, నదీపర్వత వర్ణన, యుగముల వివరణ, మన్వంతరాలు, స్వాయంభవ సర్గ యొక్క వర్ణన ఇందులో చెప్పబడిన విషయాలు. చివరలో ప్రళయము సృష్టులను వివరిస్తూ ఈ పురాణం ముగుస్తుంది.

డా. విల్సన్, ద్విజేంద్రలాల్ మిశ్రా, భండార్కర్ మొదలైన విద్వాంసులు బ్రహ్మాండపురాణ అస్తిత్వమునే శంకించిరి. కానీ నారదీయ పురాణానుసారము వివిధ వృత్తాంతములు గల బ్రహ్మాండ పురాణము సంపూర్తిగా లభ్యమగుచున్నది.

నారద పురాణమున చెప్పనట్లు దీనియందు రామాయణ వర్ణనము లేదు. కానీ పరశురామ వృత్తాంతము విపులముగా కలదు. కావున నారద పురాణము చెప్పిన రామావతార ప్రసంగమిది కావచ్చును. ఈ పురాణమున లలితోపాఖ్యానము విస్తృతముగాకలదు. కానీ శ్లోక సంఖ్యలను బట్టి లలితోపాఖ్యాన, ఆధ్యాత్మ రామాయణములిందవిలేవని చెప్పటకు వీలులేదు. అయినను ఈ పురాణమునుందు గణేశకవచ, తులసీకవచ, సిద్ధలక్ష్మీస్తోత్ర, సీతాస్తోత్ర, లలితా సహస్రనామ, సరస్వతీస్తోత్రము వంటి అనేక స్తోత్రములు అనేకముల కలవు.

మితాక్షరి, అపరార్క-కల్పతరువు, స్మృతిచంద్రిక, నిర్ణయసింధు, హేమాద్రి మొదలైన ధర్మశాస్త్ర గ్రంథములలో బ్రహ్మాండపురాణము నుంచి అనేక శ్లోకములు ఉద్ధరింపబడినవి. ఈ పురాణమున భారతమునగల సహ్యాద్రిపర్వత ప్రాంతమునందు పుట్టిన గోదావరి పరివాహక ప్రదేశములను అతి సుందరముగా వర్ణించినది. ఈ ఆధారముచేతనే విద్వాంసులు ఈ పురాణ జన్మస్థానము సహ్యాద్రి-గోదావరి ప్రదేశమై ఉండవచ్చునని అభిప్రాయమును ప్రకటించుచున్నారు.

డా. కిర్ఫెల్ మహాశయుడు వాయుపురాణ - బ్రహ్మాండపురాణముల అంతర్గత సాక్ష్యములను బట్టి రెండింటిలోనుగల సామ్యములను విశేషముగా విశ్లేషించి దీని రచనా కాలము క్రీ.శ. 4వ శతాబ్దముగా నిర్ణయించెను.

## మహాపురాణాలలో బ్రహ్మాండమహాపురాణం స్థానం

లభ్యం అవుతున్న పురాణాలలో బ్రాహ్మాండమహాపురాణం కూడా ప్రాచీన పురాణాలలో ఒకటి. పురాణ గణనాక్రమంలో దానికి అన్ని పురాణాలలో దానికి 18వ స్థానం ఇవ్వబడింది. వామన పురాణం III. 6.21-25, భాగవతం XII స్కంధం 13-4-8, లింగపురాణం 1.39.61.63, మత్స్యపురాణం 53.12, స్కాందపురాణం VII. 2.5.7 లలో ఇవ్వబడిన పురాణగణన నాటికి నిర్దేశించిన స్థానాలు బ్రాహ్మాండపురాణానికి 18వ స్థానాన్నే ఇచ్చాయి.

## పురాణ పంచలక్షణాలు :

ప్రతి పురాణంలోను ఉండవలసినవి పంచలక్షణాలు. ఈ లక్షణాలను బ్రహ్మాండపురాణం కూడా మరొకమారు తెలుపుతున్నది.

> **సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశోమన్వంతరాణిచ**
> **వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్** (బ్రహ్మాండ. 1-1-37-38)

అని సర్గము అనగా ఈ బ్రహ్మాండము యొక్క ప్రధాన సృష్టి, ప్రతిసర్గ లేక బ్రహ్మాండము వినాశనమైన తరువాత పునఃసృష్టి, వంశము లేక దేవతలు వివిధ వంశకర్తలు ఋషుల సృష్టి. మన్వంతరం లేక మనువుల అనగా వివిధ పితృదేవతల వినాశనమును, పునఃసృష్టి కాలములు వంశానుచరితము లేక వివిధ క్షత్రియ (రాజ) వంశముల భూత, వర్తమాన, భవిష్యత్ క్రమములు. ప్రస్తుతం లభ్యం అవుతున్న చాలా పురాణాలలో ఈ పంచలక్షణాల వివరణవరకే పరిమితం కావటం లేదు. లేక ఈ పంచలక్షణాలను సమగ్రంగా వివరించటానికి కట్టుబడి ఉండటం లేదు. ఈ విషయాలు లేక పురాణ పంచలక్షణాలు చాలా సాధారణంగా అన్ని పురాణాలలోను పేర్కొనబడి ఉంటాయి. ఇవిగాక అనేక ఇతర మత కర్మకాండ, ఆరాధనా విశేషాలు, దేవతల అర్చన విధానాలు, తీర్థప్రదేశాలు, ఉపవాసాలు, దేవతలకు అర్పించవలసిన వస్తువులు, విధానాలు వాటి ఫలితాలు, ప్రాయశ్చిత్తాలు మొదలైన అప్రధాన విషయాలు ప్రధానంగా వివరింపబడుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం తరువాత కాలాలలో ఈ పురాణాలు మార్పులకు లోనుకావటమే. అయితే ప్రస్తుత

బ్రహ్మాండపురాణంలో మాత్రం ఈ విషయాలన్నీ ఈ పురాణ పంచలక్షణాలను వివరంగాను ప్రధానంగాను తెలియజేయటంవలన ఇది ప్రాచీనకాలానికి చెందిననదిగా భావించబడుతున్నది.

## వక్తృశ్రోతృ పరంపర :

బ్రహ్మాండపురాణంలో రెండు ప్రదేశాలలో ఈ పురాణాన్ని బోధించినవారు శ్రోతలుగా విన్న వారిని గురించి తెలియజేయబడింది.

గ్రంథ ప్రారంభంలో

**పురాణం లోక తత్త్వార్థమఖిలం వేద సంమ్రితమ్**
**ప్రశశంస సభగవాన్ వసిష్ఠాయ ప్రజాపతిః**
**తత్త్వజ్ఞానామృతం పుణ్యం వసిష్ఠో భగవాన్ ఋషిః**
**పౌత్రమధ్యాపయామసశక్తేః పుత్రం పరాశరమ్**
**పరాశరశ్చ భగవాన్ జాతూ కర్ణ్యమృషింపురా !**
**తమధ్యాపితవాన్దివ్యంపురాణం వేద సంమితమ్**
**అధిగమ్య పురాణం తు జాతూ కర్ణ్యోవిశేషవిత్ ।**
**ద్వైపాయనాయప్రపదదౌపరం బ్రహ్మ సనాతనమ్**

(వేద సమ్మితము-వేదములోని విషయములతో కూడినది-లోకముల యొక్క యథార్థ జ్ఞానయుతము అయిన పురాణమును భగవానుడైన ప్రజాపతి (బ్రహ్మ) వశిష్ఠునికి చెప్పెను. తత్త్వజ్ఞానా మృతము, పుణ్యవంతము అయిన పురాణమును భగవంతుడు, ఋషియు అయిన వశిష్ఠుడు, శక్తిపుత్రుడు, తన మనుమడు అయిన పరాశరుని చదివించెను (అనగా పరాశరునికి చెప్పెను). భగవానుడైన పరాశరుడు పూర్వము వేద సమ్మితము దివ్యము అయిన పురాణమును, జాతూకర్ణుడు అను ఋషికి నేర్పించెను. సర్వవిశేషములను ఎఱిగిన జాతూకర్ణుడు పురాణమును నేర్చుకొని, పరమము బ్రహ్మతుల్యము, సనాతనము అయిన పురాణమును ద్వైపాయనునకు ఇచ్చెను)

దీనిని పరిశీలించి చూడగా

బ్రహ్మదేవుడు → వశిష్ఠుడు → పరాశరుడు → జాతూకర్ణుడు → ద్వైపాయన వ్యాసుడు తరువాత ఆయన నుంచి రోమహర్షణ సూతుడు. ఈ వక్తృశ్రోతృ పరంపరగా తెలిసినట్లు ఉన్నది. అయితే నారదపురాణంలో (109-33-36) పై వరుసలో పరాశరునికి బదులుగా శక్తిని పేర్కొన్నది. అంతేగాక జాతూకర్ణునికి వ్యాసునికి మధ్య వాయువును చేర్చినది.

ఈ పరంపర పైన చెప్పన దాని కంటే చాలా దీర్ఘంగా ఉన్నది. ఆ పరంపర బ్రహ్మాండ పురాణంలోనే చివరి భాగంలో ఉన్నది (లలితోపాఖ్యాన ప్రారంభానికి ముందు) – (బ్రహ్మాండపురాణం III-IV-4-58) దాని ప్రకారం ఇప్పుడు వక్తృశ్రోతృ పరంపర ఈ విధంగా ఉంటుంది.

బ్రహ్మదేవుడు → మాతరిశ్వుడు (వాయుదేవుడు) ఉశనసుడు → బృహస్పతి → సూర్యుడు లేక మైత్రావరణుడు → యమధర్మరాజు → ఇంద్రుడు → వశిష్ఠుడు → సారస్వతుడు → త్రిధాముడు → శారద్వతుడు → త్రివిష్టపుడు → అంతరిక్షుడు → త్రయ్యారుణి → ధనంజయుడు → కృతంజయుడు → భారద్వాజుడు → గౌతముడు → నిర్యయంతారా → వాజశ్రవస్ → సోమశుష్ముడు → తృణబిందుడు → దక్షుడు → శక్తి → పరాశరుడు (తల్లి గర్భంలో ఉండగానే) → జాతూకర్ణుడు → ద్వైపాయనుడు (వ్యాసుడు) → సూతరోమహర్షుడు శౌనకాది మహర్షులకు సత్రయాగ సమయంలో విన్పించాడు.

అయితే వశిష్ఠుడు తన కుమారుడైన శక్తికి ప్రత్యక్షంగా తానే బోధించకుండా, ఆయన నుంచి పదిహేను తరాలకు చెందిన బోధకులు లేక సమకాలికులైన గురువుల తండ్రి వశిష్ఠుడు కుమారుడు శక్తికి మధ్యలో చేరారనేది ఎవరూ ఊహించలేని విషయం. వాయుపురాణంలో కూడా (103-58-66) ఇదే వరుస లేక పరంపరను తెలుపుతున్నది.

ఈ పైన చెప్పిన వరుస అంత కూడా యథాతథంగా, పురాణం చివరున్న (లలితోపాఖ్యానం ప్రారంభానికి ముందు) ఉన్నది.

## వాయు పురాణము - బ్రహ్మాండ పురాణము

వాయు పురాణానికి బ్రహ్మాండపురాణానికి అనేక పోలికలు ఉండటంవలన ఈ రెండింటికీ మూలం ఒకటే అని భావింపబడుతున్నది. డా. కిర్‌ఫెల్ తన గ్రంథపు ఉపోద్ఘాతంలో బ్రహ్మపురాణ రచనా కాలాన్ని తెలిపే అధ్యాయంలో చాలా ఎక్కువగా చర్చించాడు. ఈ రెండు పురాణాలు విడిపోయిన కాలం క్రీ.శ. 4వ శతాబ్ది అని కిర్‌ఫెల్ అభిప్రాయం. అంటే ఇప్పటి రూపాన్ని బ్రహ్మాండపురాణం క్రీ.శ. 400 ప్రాంతంలో పొందింది అని నిర్ణయింపవచ్చు అని ఆయన ఉద్దేశ్యం.

ఏసియాటిక్ సొసైటీ కలకత్తా వారిచే ప్రకటింపబడిన బ్రహ్మాండపురాణమునందు పొరపాటున వాయుప్రోక్త సంహిత అని ముద్రించబడినది. అందుచేత డా. విల్సన్ మొదలైనవారు బ్రహ్మాండ పురాణం వాయుపురాణమే తప్ప అన్యంకాదని పేర్కొన్నారు. కానీ నారదీయ పురాణానుసారం వాయువుచేత చెప్పబడిన ఈ పురాణాన్ని వ్యాసునిచే ఉపదేశింపబడినది చెప్పబడినది.

**వ్యాసోలబ్ధ్వా తతశ్చైతాం ప్రభంజనముఖో దతామ్**
**ప్రమాణీకృత్య లోకేఽస్మిన్ ప్రావర్తవదనుత్తమామ్**

కావున అందువలన డా. విల్సన్ అభిప్రాయము సరియైనది కాదని చెప్పవచ్చును.

ఈ పురాణంలో పరశురామ వృత్తాంతము 29 అధ్యాయాలలో సవిస్తరంగా ఉన్నది. మహాభారతంలోని పరశురాముని వృత్తాంతమే ఇందులో విపులీకరించబడింది. ఈ విస్తరణ సంస్కృత మహాభారతము ఆధారంగా జరిగింది. ఇటువంటి పరిబృంహణం తప్పకుండా మహాభారత రచనా కాలానికి తరువాతదే కావాలి. అంటే ఎంత ఈవలికి ఈడ్చినా క్రీ.శ. 390 సంవత్సరాల ప్రాంతానికి

తరువాతదేనని చెప్పవచ్చు. ఇంతేకాకుండా బ్రహ్మాండపురాణం రాజనీతికి సంబంధించిన అనేక ప్రత్యేక పదాలను చాలా నిర్దిష్టమైన అర్థాలలో ఉపయోగించింది. వాటిలో 'మహారాజాధిరాజ' అనేదికూడా ఒకటి. హిమాలయ పర్వతాన్ని వర్ణిస్తూ ఈ పురాణంలో 'దృష్ట్వాజనైరాసాద్యో మహారాజాధిరాజవత్' (3-22-29) అని చెప్పబడింది. ఈ రాజాధిరాజ శబ్దం గుప్తరాజుల నుంచే శాసనాలలో బిరుదవాచకంగా ఉదాహరింపబడింది. ఇంతేగాకుండా ఈ పురాణంలో (3-41-32) లో కన్యకుబ్జ మహారాజు పేర్కొనబడ్డాడు. అందువలన దీని రచనాకాలం గుప్తచక్రవర్తుల తరువాతేనని నిర్ణయించవచ్చు. ఈ పురాణంలోని అనేక ప్రదేశాలలో చేయబడిన వైదర్భీరీతి రచనా విధానం, వర్ణనలలో కాళిదాసు ప్రభావం వీటి అన్నింటిని పరిశీలించగా ఇది గుప్తుల అనంతరకాల రచన అని నిర్ణయం చేసే అవకాశం ఉన్నది. అందువలన దీని రచనా కాలం క్రీ.శ. 400 సంవత్సరాల ప్రాంతం అని నిర్ణయం చేయవచ్చు. ఇది క్రీ.శ. 600 నుంచి 500 సంవత్సరాల మధ్య కాలంలో ప్రస్తుత రూపాన్ని ధరించి ఉంటుందని నిర్ణయించవచ్చు.

ఆర్.సింహాణి మహాశయుడు బ్రహ్మాండపురాణాన్ని అతిప్రాచీన పురాణంగా పరిగణిస్తున్నారు. వీరు పర్గీటర్ అభిప్రాయాన్నే బలపరుస్తున్నారు. ఇందుకు ఉపపత్తిగా ప్రాచీన నిబంధకారులు కొందరు వాయుపురాణంలోనివని చెప్పి ఉద్ధరించిన శ్లోకములు కొన్ని ఇచ్చట బ్రహ్మాండపురాణంలో లభ్యం కావటం ఇందుకు ప్రముఖమైన కారణం అంటున్నారు. ఇంతేగాకుండా బల్లాలసేనుడు, దేవనభట్టు, హేమాద్రి మొదలైనవారు బ్రహ్మాండపురాణంలోనిదని చెప్పి ఉద్ధరించిన శ్లోకాలు ప్రస్తుతం ముద్రితం అయి ప్రచారంలో ఉన్న బ్రహ్మాండపురాణంలో కనిపించడం లేదు అని. ప్రస్తుతం అవి వాయుపురాణంలో ఉన్నాయి. ఇవి చాలా విధాలుగా ప్రవర్తన చెందాయని చెప్పవచ్చు. హేమాద్రి చతుర్వర్గ చింతామణిలో అనేక వ్రతాలను విధానాలను బ్రహ్మాండపురాణం నుంచి వివరించాడు. ఇవి ఆధునిక కాలంలో ప్రచారంలో ఉన్న బ్రహ్మాండపురాణంలో లేవు. అలాగే బల్లాలసేనుడు ఉపయోగించిన బ్రహ్మాండమహాపురాణ ప్రతికూడా అతని ఉల్లేఖనాలను బట్టి హేమాద్రి వాడిన ప్రతికన్నా భిన్నమని చెప్పవచ్చును.

విచిత్రమైన విషయం ఏమిటంటే ప్రస్తుతం లభ్యం అవుతున్న బ్రహ్మాండ వాయుపురాణాలలో ఒకే రకమైన పోలికలికలు చాలా ఎక్కువగా ఉన్నాయి. పోలికలు అనటం కంటే అక్షరం అక్షరం ఈ రెండింటిలో ఒకటిగానే కన్పిస్తున్నాయి. అనేక భాగాలలో శ్లోకం శ్లోకాలు, అధ్యాయం అధ్యాయాలు ఒకేరకంగా ఉన్నాయి. ఆ విధంగా ఒకటిగానే ఉన్న విషయాలు ఈ క్రింద చూపిన పట్టికలో చూపబడ్డాయి.

| విషయము | బ్రహ్మాండపురాణం అధ్యాయ సంఖ్య | వాయుపురాణం అధ్యాయ సంఖ్య |
|---|---|---|
| 1. పురాణ అనుక్రమణిక | I - 1 | 1 |
| 2. నైమిశ సత్ర నిరూపణము | 2 | 2 |
| 3. సృష్టి ప్రకరణము | 3-5 | 4-6 |
| 4. ప్రతిసంధి కీర్తనము | 6 | 7 |

| విషయము | బ్రహ్మాండపురాణం అధ్యాయ సంఖ్య | వాయుపురాణం అధ్యాయ సంఖ్య |
|---|---|---|
| 5. చతురాశ్రమ విభాగము | 8 | 9 |
| 6. మన్వంతర వర్ణనము | 9 | 10 |
| 7. మహాదేవకి భూతివర్ణనము | 10 | 27 |
| 8. ఋషివంశాను కీర్తనము | 11 | 28 |
| 9. అగ్నివంశ వర్ణనము | 12 | 29 |
| 10. దక్షశాప వర్ణనము | 13 | 30.1-78; 31 |
| 11. స్వాయంభువ వంశవర్ణనము | 14 | 33 |
| 12. జంబూద్వీప వర్ణనము | 15 | 34.1-57, 45.1-9 |
| 13. భువన విన్యాసః | 16-20 | 45.67-137 |
| 14. జ్యోతి ప్రచారః | 21-23 | 50-52 |
| 15. జ్యోతిః సన్నివేశః | 24 | 53 |
| 16. లింగోద్భవ స్తవః | 26 | 55 |
| 17. పితృవర్ణనమ్ | 28 | 56 |
| 18. యుగావర్తః | 29 | 57-1-85 |
| 19. యజ్ఞవర్ణనమ్ | 30 | 57-86-125 |
| 20. చతుర్యుగాఖ్యానమ్ | 31 | 58 |
| 21. ఋషి లక్షణమ్ | 32-33 | 59 |
| 22. వేదపురాణ విభజనమ్ | 34 | 60.1.62 |
| 23. ప్రజాపతి వంశానుకీర్తనమ్ | 35 | 60.63-66(ఎ) |
| 24. పృథ్వీదోహనము | 36 | 61 |
| 25. పృథువంశానుకీర్తనము | 37 | 63 |
| 26. వైవస్వత సర్గవర్ణనమ్ | 38 | 64 |
| 27. ప్రజాపతి వంశానుకీర్తనమ్ | II 1-2 | 65 |
| 28. కాశ్యపీయ ప్రజాసర్గః | 3-7 | 66-69 |
| 29. ఋషివంశానుకీర్తనమ్ | 8 | 70 |
| 30. శ్రాద్ధకల్పః | 9-20 | 71-83 |
| 31. వైవస్వతోత్పత్తి వర్ణనమ్ | 59 | 84 |
| 32. వైవస్వతమనువంశ వర్ణనమ్ | 60-64 | 85-89 |
| 33. సోమజన్మ వివరణమ్ | 65 | 90 |
| 34. చంద్రవంశకీర్తనమ్ | 66-71 | 91-96 |
| 35. విష్ణుమహాత్మనమ్ | 72-73 | 97-98 |

| విషయము | బ్రహ్మాండపురాణం అధ్యాయ సంఖ్య | వాయుపురాణం అధ్యాయ సంఖ్య |
|---|---|---|
| 36. తుర్వస్వాది వంశవర్ణనమ్ | 74 | 99 |
| 37. మన్వంతరాణి సర్గ వర్ణనమ్ | III 1 | 100 |
| 38. భూలోకాది వ్యవస్థావర్ణనమ్ | 2 | 101 |
| 39. ప్రతిసర్గవర్ణనమ్ | 3 | 102 |
| 40. సృష్టివర్ణనమ్ | 4 | 103 |

పై విషయాన్ని పరిశీలిస్తే పరశురామ-సగర వృత్తాంతము (2.21-58-37), లలితోపాఖ్యానము (3.5-44-150) తప్ప మిగిలిన బ్రహ్మాండపురాణం అంతా వాయు పురాణంలోని వృత్తాంతాలలో ఒకటిగానే ఉన్నదని అని తెలుస్తున్నది. పురాణాలపై మొదట మొదట పరిశోధనలు చేసిన పర్గీటర్, రామచంద్ర హజ్రా మొదలైనవారు ఈ పోలికలను పరిశీలించారు. వారి అభిప్రాయం ప్రకారం వాయు, బ్రహ్మాండపురాణాలు ఒకటే, వేరు వేరు కావు అని భావించారు. రామచంద్ర హజ్రా 'ఈ రెండు పురాణాలు కేవలం ఒకటే మూల పురాణమే అయినా ఎందుకు వేరు వేరు పేర్లతో ప్రచారంలోకి వచ్చిందో తెలియటం లేదు' అని సందేహం వెలిబుచ్చాడు. అయితే ఇందుకు జవాబుగా అసలు పురాణాల నిర్మాణంలోనే ఉండే ప్రధాన విషయాలను గురించి మనంతెలుసుకోవలసి ఉన్నది.

## ఒకప్పుడు అన్ని పురాణాలు బ్రహ్మాండపురాణంలో అంతర్భాగాలా ?

పురాణ వాఙ్మయం విస్తృతంగా పెరిగి నాలుగు లక్షల శ్లోకాల పరిమితికి చేరిన నేడు ఈ విషయాన్ని నిర్ధారించటానికి అంతగా అవకాశంలేదుగానీ పండితులు అనేకులు 'ఆరంభంలో పద్దెనిమిది కాదని తెలుపుతున్నారు. మొదట శ్లోకాత్మకమైన పురాణం ఒకటే ఉన్నట్లు అది క్రమంగా వేదోపబృంహణం చేయటం అనే అంశం ఆధారంగా క్రమంగా పెరిగినట్లుగా, దాని గ్రంథసంఖ్య మొదట కొద్దిగా ఉండి తరువాత పెరుగుతూ పోయి, వేఱువేఱు కాలాలలో పెరిగిన కూర్పులు బయలు దేఱినట్లుగా చెప్పటానికి పురాణాలలోనే కొన్ని సూచనలు ఉన్నాయని తెలుపుతున్నారు.

జాక్సన్ అనే ఐరోపీయ పరిశోధకుడు "వైదికయుగం చివరి భాగం నుంచి క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం వరకు ఇతిహాసాలకు అనుబంధంగా పురాణం ఒకటి ఉండి నట్లుగా అందులో సర్గము, ప్రతి సర్గము, వంశము, వంశాను చరితము, మన్వంతరము అనేవి వర్గీకరింపబడినట్లు హిందువుల వ్రాతలవలననే తెలియవస్తున్నది. స్టీఫెన్ కాలం వఱకు వేఱువేఱు మఠాలలో వ్రాయబడుతూ వచ్చిన శాక్జన్ వృత్తాంతా (శాక్జన్ క్రానికల్)ల వంటివే ఈ పురాణాలు. నార్మనుల దండయాత్ర తరువాత పరస్పర సంబంధంలేని భాగాలు ఆ వృత్తాంతంలో చేరిపోతూ వచ్చినట్లే హిందూ సామ్రాజ్య కేంద్ర ప్రభుత్వం అంతరించిన పిదప పండిత సమావేశాలు అంతకుపూర్వం కంటే కష్టతరమైనా అప్పటి నుంచి ఆయా పుణ్యక్షేత్రాలలోని పండితులు తమ దగ్గరగల శ్లోకాత్మకమైన మూలపురాణ ప్రతులలో అక్కడక్కడా మార్చటం, కొన్నిచోట్ల స్థానిక విషయాలను చేర్చి గ్రంథాన్ని

పెంచడం సంభవించి ఉండాలి. మూల గ్రంథమైన ఆది పురాణం నుంచి ఈ విధంగా బ్రహ్మపురాణం ఒరిస్సాలోను, పద్మపురాణం పుష్కర క్షేత్రంలోను, అగ్నిపురాణం గయలోను, వరాహపురాణం మధురలోను, వామన పురాణం స్థానేశ్వరంలోను, కూర్మపురాణం వారణాసిలోను, మత్స్యపురాణం నర్మదా ప్రాంతంలోను పుట్టాయి" అని వ్రాశాడు.

## మొదటలో ఉన్న ఆది పురాణం పేరు ఏమిటి?

ఒక్క పురాణం నుంచి పెక్కు పురాణాలు పుట్టాయనటానికి విష్ణుపురాణమే ఒక దృష్టాంతము. విష్ణు పురాణం పురాణాలకే ఆదర్శమైనదని, పురాణాలలో పురాతనమైనదని పరిశోధకుల భావన. కానీ ఈ విష్ణుపురాణం కూడా స్వతంత్రం కాదు, ఒకప్పుడిది బ్రహ్మాండపురాణం అనే సర్వసమగ్ర పురాణం యొక్క భాగంగా ఉండేది. తరువాత కాలంలో దానినుంచి చీలి, స్వతంత్ర పురాణం అయింది. 16వ శతాబ్దంవాడైన వెన్నెల కంటి సూరన విష్ణుపురాణాన్ని తెలుగులోకి అనువదించాడు. అందులో షష్ఠ్యంతాలైన తరువాత "అభ్యుదయ పరంపరాభివృద్ధిగా నా యొనర్పంబూనిన బ్రహ్మాండ పురాణంబునందలి పరాశరసంహితయైన శ్రీవిష్ణుపురాణంబునకు కథాక్రమంబెట్టిదనిన' అని చెప్పాడు. ఇంతేకాక ప్రతి ఆశ్వాసం చివర గద్యలోను ఇలాగే వ్రాశాడు. దీనిని బట్టి 16వ శతాబ్దంలోని సంస్కృత విష్ణుపురాణ ప్రతిలో అది బ్రహ్మాండపురాణంలోని పరాశర సంహిత అనబడే భాగమని వ్రాసి ఉండాలని నిశ్చయంగా తెలుసుకొనవచ్చు. అయితే ఎందుకు ఈ విషయం ప్రస్తుత ముద్రిత సంస్కృత విష్ణు పురాణంలో చెప్పబడలేదంటే ఇది స్వతంత్ర పురాణం కాక ఒక మహాపురాణంలోని భాగం అంటే దాని గౌరవం తగ్గిపోతుందనే భయం వలన కావచ్చును. ఇటీవలివారు సంస్కృత లిఖిత ప్రతులు వ్రాసుకొనే సమయంలో ఈ మాటను ఎత్తివేసి ఉండవచ్చు. అయితే కొన్నింటిలో మాత్రం పరాశర సంహిత అని ఉన్నది.

అయితే 11వ శతాబ్దంనాటి ఆల్‌బెరూనీ అనే పండితుడు భారతదేశం వచ్చి మన గ్రంథాలను కొంత పరిశీలించటం జరిగింది. ఆయన ఇచ్చిన పురాణాల పట్టికలో విష్ణుపురాణం, బ్రహ్మాండ పురాణాలు వేర్వేరుగా పేర్కొనబడ్డాయి. అందువలన పదకొండవ శతాబ్దానికి ముందే బ్రహ్మాండ పురాణం నుంచి విష్ణుపురాణం విడిపోయిందన్నమాట. భారతదేశంలో వైష్ణవమతం బాగా ప్రచారం లోకి వచ్చిన తరువాత విష్ణుపురాణం బ్రహ్మాండపురాణ భాగమని పేర్కొనడం ఆగిపోయి ఉండవచ్చు.

మొత్తంమీద మొదట బ్రహ్మాండమనే పురాణం ఒకటే ఉండేదని, అది అనేక సంహితలుగా ఉండేదని, విష్ణుపురాణం ఆ సంహితలలో ఒకటని చెప్పవచ్చు.

ఇక వాయుపురాణాన్ని పరిశీలించగా అందరు పండితులు వాయుపురాణాన్ని ప్రాచీన పురాణంగా అంగీకరిస్తున్నారు. ఇది హర్షచరిత్రంలోను, బాణుని కాదంబరిలోను పేర్కొనబడింది. ప్రస్తుతం బ్రహ్మాండపురాణంగా ముద్రితం అయిన గ్రంథంలో దాదాపు రెండువంతులు అంటే పరశురామ సర్గ వృత్తాంతము, లలితోపాఖ్యానం తప్ప మిగిలిన భాగం 78 అధ్యాయాలు, శ్లోకాలతో సహా మారకుండా వాయుపురాణంలో యథాశ్లోకంగా ఉన్నాయి. కాబట్టి వాయుపురాణం అసలు

వాయుపురాణం కాదని గయాక్షేత్రమాహాత్మ్యం కూడా కలిసి ఉన్న బ్రహ్మాండపురాణంలోని ఒక భాగమని భావించవచ్చు. అనగా బ్రహ్మాండపురాణంలోని వాయు సంహితను వాయు పురాణంగా పరివర్ధితం చేసి ఉండ వచ్చుని భావించటంలో ఎలాంటి అసంగతము ఉండదు. ఇందుకు బలంగా నారదపురాణంలోని ఒక కథలో దీనికి సూచన ఉన్నది. అందులో "నాలుగు పాదాలతోను బ్రహ్మాండ పురాణాన్ని వర్ణించి ఉన్నాను. ఇది పదునెనిమిదవది, అనుపమానమైనది. సారాతీతమైనది. బ్రహ్మాండ పురాణం నుండి పారాశర్యమహాముని దీనినే అందరికీ పదెనెనిమిది విధాలుగా చెప్పి ఉన్నాడు. ఆ మహాముని నావలన పురాణాలను విని, మననముచేసికొని ధర్మశీలురును, దీనానుగ్రహకరులైన మునులకు తెలియచెప్పి వానిని లోకమున వ్యాపింపచేసెను. (నారదపురాణం 100-29-35) అని చెప్పబడింది.

దీనినిబట్టి బ్రహ్మాండపురాణమే అన్ని పురాణాలకు మూలాధారమని ఒక పురాణ గాథ ఉన్నట్లు తెలుస్తున్నదిగదా. ఇంకొక ఆధారం మనభారతీయ హిందువులు క్రీ.శ. 5వ శతాబ్దానికంటే ముందే బలిద్వీపానికి వలస పోయారు. వెళ్లేటప్పుడు వారు తమతో తమ గ్రంథాలను కూడా కొన్నింటిని తీసుకొని వెళ్ళారు. అవి ఆ దేశ భాష అయిన 'కవి' భాషలోనికి అనువదించబడ్డాయి. ఆ గ్రంథాలలో సంస్కృతమూలాలతో సహా ఋగ్వ జుస్సామఅథర్వవేదాలు, రామాయణ మహాభారతములు కూడా ఉన్నాయి. పురాణాలలో ఆ బలిద్వీపవాసులు ఒక్క బ్రహ్మాండాన్నే గానీ, మిగిలిన వాటి పేర్లను కూడా ఎరగరు. అంటే మిగిలిన వాటి పేర్లను కూడా తెలియనంతగా ఉన్నారంటే ఆనాటికి ఒక్క పురాణమే ఉండేదని భావించవచ్చుగదా. పైగా బలిద్వీపంలో ఒకతెగ శైవులు ఉన్నారు. వారు బ్రహ్మాండపురాణన్నే తమ పురాణంగా అంగీకరిస్తారు. అందువలన హిందువులు వలస పోయినప్పుడు ఒకటే పురాణం ఉండేదని భావించవచ్చు. అలాగే నేటి బ్రహ్మ పురాణంలో చాలా భాగాలు మక్కికి మక్కి విష్ణుపురాణంలోని భాగాలే భాగవతంలోని కథలు అన్నీ విష్ణుపురాణాన్ని అనుసరించి వ్రాయబడినవే. అలాగే అనేక పురాణాలలో ఉన్న శ్రాద్ధకల్ప విషయాలు దాదాపు ఏకరీతిగా ఉన్నాయి. అందువలన మొత్తంమీద క్రీస్తుశకం మూడు నాలుగు శతాబ్దాల వరకు పురాణం అనే పేరుతో ఒకే గ్రంథం ఉండేదని, దానికే అప్పుడుకానీ, అటుతరువాత కానీ బ్రహ్మాండపురాణం అనే పేరుండేదని దానిలో పన్నెండు వేల శ్లోకాలకంటే ఎక్కువగా ఉండేవి కావని, ఆ పురాణంలోని భాగాలు క్రమంగా దాని నుంచే వేరుపడి ప్రత్యేక పురాణాలు అయినాయని, ఈ విధంగా తఱిగి పోవటం వలన మూల పురాణం క్రమంగా సన్నగిల్లి, కేవలం పేరుకు మాత్రం మిగిలిందని, మూల పురాణ భాగాలన్నింటి లోకి గొప్పవి, మొట్టమొదట చీలిపోయినవి విష్ణు వాయు పురాణాలు కావచ్చునని, కొంతకాలం వరకు ఏయే భాగాలు ఏయే మూలగ్రంథ భాగాలో తెలుపబడుతూ ఉండేవని, కాని క్రమంగా మతముమీది అభిమానము ఎక్కువైన కొద్దీ గౌరవ భంగం అని తలచి కావచ్చు మూలగ్రంథపు పేరును జారవిడిచి స్వతంత్రాలైన ప్రత్యేక పురాణాలుగా వాటిని ప్రకటించడం మొదలైందని నిర్ణయించవచ్చు.

పురాణం లౌకిక శాస్త్రం. ఇది వేదం కంటే భిన్నమైనది. కానీ వేదానికి అనుకూల మైనట్టిది. ఇదే వేదోపబృంహణం. ఇది ఎప్పుడూ స్థిర రూపాన్ని కలిగి ఉండదు. ఇది కాలాన్ని అనుసరించి,

పరివర్తన శీలకమైనట్టిది. కాల ప్రభావంచేత మార్పులను పొందుతుంటుంది. అందుకే తంత్రవార్తిక మనే గ్రంథం వేదం అకృత్రిమమైనదని, పురాణం కృత్రిమ మైనదని చెప్తున్నది. అందుకే నిరుక్తం 'పురాపి నవం భవతి' పాతది అయినా కొత్తగానే ఉంటుంది అని పురాణాన్ని గురించి చెప్పింది. అంటే కాలాంతరం ఉత్పన్నమయ్యే మార్పులను పురాణం తనలో లీనంచేసుకొంటుందని దీని భావం.

వ్యాసుడు బ్రహ్మాండపురాణాన్ని ఎప్పుడు వ్రాశాడు. 17 పురాణాలు బ్రహ్మాండపురాణం నుంచి గరుడ పురాణంవరకు వరుసగా రచించి 18వది అయిన బ్రహ్మాండపురాణాన్ని వ్రాయలేదా ?

పద్మపురాణంలో చెప్పబడిన విషయాన్ని అనుసరించి పైన చెప్పిన విధంగా కాదు. పద్మ పురాణం ఏమి తెలుపుతున్నదంటే

అష్టాదశ పురాణాలలో పద్మపురాణాన్నే మొదట కృష్ణద్వైపాయన వ్యాసుడు రచించాడని, తరువాత సర్వపురాణాల నుంచి సారాన్ని ఆకర్షించి భాగవతం రచించాడని పద్మపురాణం తెలుపుతున్నది.

**తత్ర పద్మ పురాణంతు, ప్రథమంచ ప్రణీతవాన్**
**తతో ఽన్యాని పురాణాని కృత్వా షోడశతు క్రమాత్**
**అష్టాదశం భాగవతం, సారమాకృష్య సర్వతః**
**కృతవాన్ భగవాన్ వ్యాసః శుక మధ్యాపయసత్స్వయమ్**

(పద్మ పురాణాన్ని ముందుగా రచించి, తరువాత ఇంకొక పదహారు పురాణాలను క్రమంగా కూర్చాడని 18వదైన భాగవతాన్ని ఈ 17 పురాణాల యొక్క సారభూతంగా వ్యాసుడు కూర్చాడని తెలుస్తున్నది)

వ్యాసుడే శుకునికి భాగవతాన్ని స్వయంగా బోధించాడు.

బ్రహ్మాండపురాణం తరువాత వ్యాసుడు విష్ణుభాగవతాన్ని రచించాడని తెలుస్తున్నది.

## మూలపురాణంలోని శ్లోకాలు ఎన్ని?

దేశకాలాలను బట్టి పురాణాలు చాలా మార్పులను పొందాయి. ఇప్పుడు స్పష్టంగా ఆ మూల పురాణరూపాన్ని కనుక్కోలేకపోయినా కొన్ని ఆధారాలనుబట్టి ఒకపాటి నిర్ణయానికి రావచ్చు. భవిష్యత్పురాణంలోని "సర్వాణ్యేవ పురాణాని సంజ్ఞేయాని నరర్షభద్వాదశైవ సహస్రాణి ప్రోక్తానాం మనీషిభిః" అనే శ్లోకంవలన పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 శ్లోకాలకు పరిమితమేనని తెలుస్తున్నది. అలాగే 'పునర్వృద్ధింగతా నీహ ఆఖ్యానైర్వివిధైర్నృప, యథాస్కాందంతథాభేదం భవిష్యం కురునందన" (ఓ రాజోత్తమా పురాణాలు అన్నీ కలిపి మొదట 12,000 గ్రంథంగా ఉండేది. కాలక్రమంలో అనేక వ్యాఖ్యానాలు చేరి అది వృద్ధిచెందింది అని చెప్తూ, ఇంకా స్కాందం శత సహ స్రంతు లోకానాం జ్ఞాతమేవహి, భవిష్యమేతదృషిణా లక్షార్ధ సంఖ్యయాకృతం' స్కాందం లక్షగ్రంథాల పరిమాణం భవిష్యపురాణం యాభైవేల గ్రంథంగా పెరిగిందని లోకులందరికీ తెలుసు అని తెలుపుతున్నది.

## నారదపురాణము ప్రకారము బహ్మాండపురాణ విశేషాలు

బ్రహ్మాండ పురాణమున పన్నెండు వేల శ్లోకములు కలవు. ఆది కల్పకథ కలది. మొదట ప్రక్రియ, రెండవది అనుషంగము. మూడవది ఉపోద్ఘాతము. నాలుగవది ఉపసంహారము. ఇటుల ఈ పురాణమున నాలుగు పాదములు కలవు. మొదటి రెండు పాదములు పూర్వభాగము. తృతీయ పాదము మధ్యమ భాగము. చతుర్థపాదము ఉత్తర భాగముగా పేర్కొనబడినవి. మొదట కృత్య సముద్దేశము. తరువాత నైమిశాఖ్యానము, హిరణ్య గర్భోత్పత్తి, లోకజ్ఞానము, మానస సృష్టి కథనము, రుద్రప్రసవ వర్ణనము, మహాదేవ విభూతి, ఋషిసర్గము, అగ్నుల విజయము, కాలసద్భావ వర్ణనము, ప్రియవ్రత వంశ కథ, పృథివీ ఆయామ విస్తారములు, భారత వర్ణనము, ఇతర వర్ష నిరూపణము, జంబూ మొదలగు సప్త ద్వీపా ఖ్యానములు, అలోక వర్ణనము, ఊర్ధ్వలోక కథనము, గ్రహచారము, ఆదిత్య వ్యూహకథనము, దేవగ్రహాను కీర్తనము, నీలకంఠాఖ్యానము, మహాదేవ వైభవము, అమా వాస్యా కథనము, యుగతత్త్వ నిరూపణము, యజ్ఞ ప్రవర్తనము, అంత్యయుగ ద్వయకృతి, యుగ ప్రజాలక్షణము, ఋషి ప్రవరవర్ణనము, వేదవ్యసనాఖ్యానము, స్వాయంభువ నిరూపణము, శేష మన్వంతరాఖ్యానము, పృథివీదోహనము, అద్యతనమగు చాక్షుష సర్గము ఇది ద్వితీయ పాదము. ఇక మూడవదగు ఉపోద్ఘాతపాదమున, సప్తర్షి కీర్తనము, ప్రజాపతి వంశము, దేవాద్యుత్పత్తి, దేవా దులకు జయాభిలాష మరుదుత్పత్తి, కాశ్యప వంశ కథనము, ఋషి వంశ నిరూపణము, పితృకల్ప కథనము, శ్రాద్ధకల్పము, వైవస్వత సముత్పత్తి, వైవస్వతసృష్టి, మనుపుత్ర వంశము, గాంధర్వ నిరూపణము, ఇక్ష్వాకు వంశకథనము, మాహాత్ముడగు అత్రివంశము, అమావసు వంశము, రజి చరితము, యయాతి చరితము, యదువంశ నిరూపణము, కార్తవీర్య చరితము, జామదగ్న్య చరితము, వృష్ణి వంశకథనము, సగర సంభవము, భార్గవ చరితము, పితృకార్యవధ, సగర చరితము, మరల భార్గవచరితము, దేవాసుర యుద్ధకథ, కృష్ణావిర్భావము, శుక్రుడు చేసిన ఇంద్రస్తుతి, విష్ణు మాహాత్మ్య కథనము, బలివంశ నిరూపణము, కలియుగమున భవిష్యరాజ చరితము. ఇది మధ్యమ భాగము. తృతీయపాదము. ఇక ఉత్తరభాగమున ఉపసంహార పాదమున, వైవస్వత మన్వంతర కథ ! భవిష్య మను చరితము, కల్పప్రళయ నిర్దేశములు, కాలమానము, చతుర్దశ లోకలక్షణములు, వికర్మాచరణ మున లభించు నరకముల వర్ణన, మనోమయ పురాఖ్యానము, ప్రాకృతి ప్రళయము, శైవవర్ణము, పురవర్ణనము, త్రివిధ గుణసంబంధమువలన జంతువులకు ప్రాప్తించుగతి, అనిర్దేశ్యము, అప్రత ర్క్యము అగు పరమాత్మ అగు బ్రహ్మను అన్వయ వ్యతిరేకములచే వర్ణనము వర్ణించబడినది. ఇట్లు నాలుగు పాదములుకల బ్రహ్మాండ పురాణమును చెప్పితిని. ఇదియే పదునెనిమిది సారము లన్నిటి కంటె సారతరము. నాలుగు లక్ష శ్లోకములుకల పురాణ భాగమును వ్యాస భగవానుడు పదునెనిమిది విధములుగా విభజించి మహానుభావులగు మునులకు ఉపదేశించెను. నానుండి వ్యాసమహర్షి, అతని నుండి మునులువిని లోకములకు ప్రకాశింపచేసిరి. ఈ మునులు అందరు ధర్మశీలులు, దీనాను గ్రహకారులు, మొదట నేను ఈ పురాణమును వసిష్ఠ మహర్షికి చెప్పితిని. వసిష్ఠ మహర్షి తన పుత్రుడగు శక్తికి, శక్తి జతుకర్ణునికి, జతుకర్ణుడు వ్యాస మహర్షికి చెప్పెను. వ్యాసమహర్షి ఈ

పురాణములను ప్రమాణీకరించి ప్రవర్తింప చేసెను. ఈ పురాణములను చదివినవాడు, సావధానముతో వినినవాడు పాపములను తొలగించుకొని ఉత్తమ లోకములను పొందును. ఈ పురాణమునువ్రాసి స్వర్ణసింహాసనమున ఉంచి, వస్త్రముతోకప్పి బ్రాహ్మణునకు దానము చేసినచో బ్రహ్మలోకమును పొందును. ఓ మరీచి మహర్షీ! నీకిట్లు అష్టాదశ పురాణములను చెప్పితిని. ఇట్లు అష్టాదశ పురాణములను చెప్పువాడు వినువాడు పునర్జన్మను పొందడు. పురాణపఠన ఫలమును కోరువారు ఈ పురాణ సూత్రమును నిత్యము చదువవలెను. దాంభికునకు, పాపికి, సాధు ద్వేషికి, శఠునకు చెప్పకూడదు. శాంతునకు శమచిత్తునకు, శుశ్రూష చేయువానికి, నిర్మత్సరునకు, శుచికి సద్వైష్ణవునకు ఉపదేశించవలయును.

## నారదపురాణం - బ్రహ్మాండపురాణం :

నారదపురాణం 109వ అధ్యాయం మొత్తంలో బ్రహ్మాండపురాణంలో ఏయే విషయాలు వర్ణించబడి ఉన్నాయో కొంత దీర్ఘంగా తెలుపుతున్నది. దాని తెలుగు అనువాదం క్రింద ఇవ్వబడింది. అయితే ఈ విషయాలకు సంబంధించి ఇప్పటివలె ఒక పట్టికగా క్రమవరుసలో కాకుండా అనేక చోట్ల వివరించబడ్డాయి. అందువలన బ్రహ్మాండపురాణంలో వర్ణించబడిన నారదపురాణం పేర్కొంటున్న విషయాల తులనాత్మక వివరాలు పట్టికగా ఇవ్వబడ్డాయి.

| **నారదపురాణం 109వ అధ్యాయంలో చెప్పబడిన విషయాలు** | **బ్రహ్మాండపురాణం పూర్వభాగం ప్రక్రియాపాదంలో ఆ విషయాలుగల అధ్యాయ సంఖ్య** |
|---|---|
| ఆచార విధులు (కృత్యసముద్దేశము) | I. 1.1. |
| నైమిశారణ్యఖ్యాన కథనము | I. 1. 2. |
| హిరణ్యగర్భోత్పత్తి వర్ణనం | I. 1-3 |
| వివిధ లోకకల్పనము | I. 1-4 |
| **నారదపురాణం – 109వ అధ్యాయం** | **బ్రహ్మాండపురాణం – పూర్వభాగం అనుషంగపాదం** |
| కల్పమన్వంతరాఖ్యానమ్ | I. ii. -6 |
| లోకజ్ఞాన వర్ణనం | I. ii - 7 |
| మానస సృష్టి వర్ణనం | I. ii - 8 |
| రుద్రప్రసవ వర్ణనమ్ | I. ii- 9 |
| మహాదేవ విభూతి వర్ణనమ్ | I. ii -10 |
| ఋషి సృష్టి వర్ణనమ్ | I. ii - 10 |
| అగ్నివంశము | I. ii - 12 |
| కాలసద్భావ వర్ణనమ్ | I. ii - 12 |

| | |
|---|---|
| ప్రియవ్రతవంశాను కీర్తనమ్ | I. ii - 13 |
| పృథివ్యాయామ విస్తారము | I. ii - 15 |
| భారత వర్ణనమ్ | I. ii - 16 |
| కింపురుషాది వర్ణనం – ఇతర ద్వీపాలు | I. ii - 17 |
| జంబూద్వీప వర్ణన ఇతర ద్వీపాలు | I. ii - 18 & 19 |
| అధోలోక వర్ణనము | I. ii - 20 |
| ఆదిత్యవ్యూహకీర్తనము | I. ii - 20 & 21 |
| ఆకాశగ్రహ సంచారము | I. ii - 22 |
| దేవగ్రహాను కీర్తనము | I. ii - 22 |
| ధ్రువచర్యా కీర్తనం | I. ii - 23 |
| జ్యోతిర్గణ సన్నివేశం | I. ii - 24 |
| నీలకంఠ నామోత్పత్తి కథనం | I. ii - 24 |
| లింగోత్పత్తి కథనం | I. ii - 26 & 27 |
| అమావాస్యాశ్రాద్ధే పితృవిచయః | I. ii - 28 |
| యుగచక్రము – యుగస్వభావము | I. ii - 29 |
| యజ్ఞ ప్రవర్తనం చతుర్యుగాఖ్యానము | I. ii - 30 |
| యుగప్రజాలక్షణము | I. ii - 31 |
| ఋషి ప్రవర వర్ణనం | I. ii - 32 |
| వేదవ్యసనాఖ్యాసం | I. ii - 33 |
| స్వాయంభువ మనువు – స్వాయంభువన మన్వంతరం | I. ii - 34 |
| శేషమన్వంతరాఖ్యానం | I. ii - 35 |
| పృథివీదోహనం | I. ii - 36 |
| చక్షుషమన్వంతరం | I. ii - 37 |
| నారదపురాణం 109వ అధ్యాయం | బ్రహ్మాండపురాణం III ఉపోద్ఘాతం |
| ఋషిసర్గ వర్ణనం | II. iii - 1 |
| ప్రజాపతి వంశానుకీర్తనం – దేవర్షి సర్గము | II. iii - 2,3 |
| మరుదుత్పత్తి | II. iii - 4 |
| కశ్యప వృత్తాంతము | II. iii - 7 |
| ఋషివంశకీర్తనం | II. iii - 8 |
| పితృకల్పం | II. iii - 9 |
| శ్రాద్ధకల్పము | II. iii - 10 నుంచి 20 అధ్యాయాలు |

| | |
|---|---|
| వైవస్వతోత్పత్తి | II. iii - 59 |
| మనువు సృష్టి | II. iii - 60 |
| గాంధర్వమూర్ఛనా లక్షణము (సంగీశాస్త్రము) | II. iii - 61, 62 |
| ఇక్ష్వాకువంశ వర్ణనము | II. iii - 63 |
| అత్రివంశానుకీర్తనము | II. iii - 8 |
| అమావసు వంశకీర్తనము | II. iii - 16 |
| రజివృత్తాంతము | II. iii - 66 |
| యయాతి చరిత్రమ్ | II. iii - 68 |
| యదువంశ వర్ణనము, కార్తవీర్య సంభవము | II. iii - 69 |
| జమదగ్ని పరశురామవృత్తాంతము | II. iii - 21వ అధ్యాయం నుంచి 46వ అధ్యాయం వరకు |
| వృష్ణి వంశానుకీర్తనము | II. iii - 71 |
| సగర జన్మము | II. iii - 47వ అధ్యాయము - 75వ అధ్యాయమునుంచి 100వ అధ్యాయం వరకు |
| భార్గవరామ వృత్తాంతము కార్తవీర్యకథ | II. iii - 37వ అధ్యాయయము నుంచి 46వ అధ్యాయం వరకు |
| సగర వృత్తాంతము | II. iii - 45వ అధ్యాయం నుంచి 56వ అధ్యాయం వరకు |
| దేవాసుర యుద్దము | II. iii - 72వ అధ్యాయము 67-195 శ్లోకాలు 73వ అధ్యాయము 1 నుంచి 68 శ్లోకాలు |
| శ్రీకృష్ణ జననం | II. iii - 71వ అధ్యాయము 195-241 శ్లోకాలు |
| విష్ణు మహాత్మ్యము | II. iii - 73 |
| బలివంశ వృత్తాంతము | II. iii - 74 - 26వ శ్లోకం మొదలు |
| కలియుగ భవిష్యద్రాజులు | II. iii - 74 |
| నారదపురాణం 109వ అధ్యాయం | ఉత్తరభాగం - బ్రహ్మాండపురాణం ఉపసంహార పాదం |
| వైవస్వత మన్వంతర వర్ణనము | III. iv - 5వ అధ్యాయము నుంచి |
| భవిష్యత్ మనుకీర్తనము | III. iv - 1 - 7 అధ్యాయము నుంచి |

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Sri+Brahmanda+Mahapuranam](http://kinige.com/book/Sri+Brahmanda+Mahapuranam)**

* * *